

# అడుగుపడితే అపాయం

## - కొమ్మూరి సాంబశివరావు



### (గత సంచిక తరువాయి)

**భార్గవప్రసాద్ కళ్ళు** ఎర్రబడ్డాయి. "ఇన్‌సల్టింగ్.. కమీషనర్ ఆఫ్ పోలీస్ నా స్నేహితుడు. హోంమంత్రి నేనూ స్నేహితులం. ఆ మాటకొస్తే నలుగురైదుగురు మంత్రులు నా పరపతివల్ల ఆ స్థానాల్లో వున్నారు. జాగ్రత్తగా మాట్లాడండి" అరిచాడు.

"అయాం వెరీ సారీ! మా ప్రశ్నలకి జవాబులు చెప్పాలి."

"చెప్పకపోతే"

"చెప్పకపోతే అనుమానం మీద మిమ్మల్ని కస్టడీలోకి తీసుకోవలసి వస్తుంది బండార్కర్ తొణకకుండా చెప్పాడు.

భార్గవ ప్రసాద్ వెంటనే రిసీవర్ తీసి రాష్ట్ర హోంమంత్రికి ఫోను చేశాడు బండార్కరు, యుగంధర్ వచ్చి తనని అడ్డదిడ్డమైన ప్రశ్నలు అడిగి బెదిరిస్తున్నారని చెప్పాడు.

"మిస్టర్ బండార్కర్ మంత్రిగారు మీతో మాట్లాడతారట" అని రిసీవర్ యిచ్చాడు.

"ఏమిటి గొడవ మిస్టర్ బండార్కర్" అడిగాడు హోం మంత్రి.

"స్పెషల్ బ్రాంచి యిన్విస్టిగేషన్. శత్రు గూఢచారులకి సంబంధించిన విషయం. ప్రస్తుతం అంతకన్నా చెప్పలేను క్షమించండి."

"పెద్ద మనిషి, డెయిలీ ఎడిటర్. దేశభక్తుడు. పరువు ప్రతిష్టలున్న మిస్టర్ భార్గవప్రసాద్‌కి ఏం సంబంధం? ఎందుకు అరెస్టు చేయడం?"

"నో! అరెస్టు చేస్తామనలేదు. నిన్నరాత్రి ఎనిమిదిన్నరకీ, తొమ్మిదిన్నరకీ మధ్య ఎక్కడున్నారని అడిగితే జవాబు చెప్పనన్నారు. అనుమానం మీదో విట్నెస్‌గానో కస్టడీలోకి తీసుకుంటాననుకున్నాను."

"ఆల్‌రైట్ భార్గవప్రసాద్‌ని మాట్లాడమనండి."

బండార్కర్ రిసీవర్‌ని భార్గవప్రసాద్‌కి ఇచ్చాడు. అయిదు నిముషాలు మంత్రితో మాట్లాడి, రిసీవర్ పెట్టేసి "ఆల్‌రైట్ మీరే నెగ్గారు" అని నవ్వి "నిజానికి దాచవలసిందేమీ లేదు. నిన్న సాయంకాలం ఏడుగంటలకి వెళ్ళాను. తరవాత ఇంట్లోంచి కదలలేదు. భోజనం చేసి నిద్రపోయాను. తెల్లారి లేచి ఎనిమిది గంటలకల్లా ఆఫీసుకొచ్చాను" చెప్పాడు భార్గవప్రసాద్.

"థాంక్స్ మీరు ఏడుగంటలనించీ యింట్లోనే వున్నట్లు, రాత్రి బయటికి ఎక్కడికీ వెళ్ళనట్లూ సులభంగానే రుజువు చెయ్యగలరనుకుంటాను. మీ భార్యా పిల్లలు, నౌకర్లు ఉన్నారుగా ఇంటిలో?" అన్నాడు యుగంధర్.

"నాకు పిల్లలు లేరు. నేను ఏడుగంటలకి ఇంటికి వెళ్ళడం నా డ్రయివర్‌కి తెలుసు. గేటు జవానుకి తెలుసు. ఇంట్లో పనిచేసే మనిషి చూసింది. వంట మనిషి కాఫీ తెచ్చి ఇచ్చింది. తరువాత నా గదిలోకి వెళ్ళిపోయాను రాత్రంతా నేను ఇంట్లోనే వున్నట్లు వాళ్ళెవరూ సాక్ష్యం చెప్పలేరు" అని చిన్న నవ్వు నవ్వి "అఫ్‌కోర్స్ నేనూ నా భార్యా ఒక గదిలోనే పడుకుంటాము కనుక ఆమె చెప్పగలదు" అన్నాడు.

"అది చాలు" అన్నాడు యుగంధర్. తన పక్కన కూర్చున్న రాజు చెయ్యిమీద చెయ్యివేసి, వేళ్ళతో అతని చేతిమీద కొన్ని గుర్తులు రాశాడు.

ముగ్గురూ కుర్చీల్లోంచి లేచారు. రాజు ముందు బయలుదేరాడు. తలుపు తెరుచుకుని బయటికి వెళ్ళిపోయాడు.

యుగంధర్ తలుపు వరకు వెళ్ళి, చటుక్కున వెనక్కి తిరిగి "అసలు విషయాలు కొన్ని అడగడం మర్చిపోయాను. మీ పత్రిక పాలసీ ఏమిటి?" అడిగాడు భార్గవ ప్రసాద్‌ని.

"మీరడిగిన ప్రశ్నలన్నిటిలోకీ ఇది చాలా అనవసరమైన ప్రశ్న. మా పత్రిక పాలసీ తెలియని భారతీయుడు వున్నాడా? కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం మా పత్రిక పాలసీ."

"ఫిరోజ్ అనే అతను చైనీస్ దేశస్థుడు. చైనా ప్రభుత్వోద్యోగి. ఏదో ప్రతినిధి వర్గంలో సభ్యుడిగా సిలోన్ వచ్చాడు. పేరు మార్చుకుని పాస్‌పోర్టు లేకుండా, రహస్యంగా సిలోన్ నించి మన దేశం వచ్చాడు."

"పారిపోయి వచ్చాడా?" అడిగాడు భార్గవప్రసాద్.

"పారిపోయి వచ్చాడో. వాళ్ళ గూఢచారిగా వచ్చాడో తెలియదు. అతను మిమ్మల్ని కలుసుకుని మాట్లాడివుంటే తెలిసేది. ఆలోగా హత్య చేయబడ్డాడు."

"పారిపోయే వచ్చి వుండాలి. ఏ చైనీస్ గూఢచారో అతన్ని హత్య చేసి వుంటాడు. లేకపోతే అతన్ని ఎవరు హత్య చేస్తారు?"

"పారిపోయి వచ్చి వుంటే, మన దేశంలో కాలు పెట్టగానే మన ప్రభుత్వాన్ని రక్షణ అడిగేవాడు. పేరు మార్చుకుని రహస్యంగా ఎందుకు తిరుగుతాడు?"

భార్గవప్రసాద్ తల విదిలించి. ఏమో నాకు యీ విషయాలన్నీ తెలియవు. నేను పత్రికా సంపాదకుడ్ని, మీరే ఆలోచించి తేల్చుకోవాలి" అన్నాడు.

"మీకేమయినా స్ఫురిస్తే నాకు టెలిఫోన్ చెయ్యండి" అని యుగంధర్ బండార్కర్‌తో అక్కణ్ణించి బయలుదేరారు.

బయటికి వచ్చి కారు ఎక్కారు. రాజు డ్రయివ్ చేస్తున్నాడు.

"ఫోన్ చేశావా?" అడిగాడు యుగంధర్.

"ఆ! కమీషనర్ ఆఫీసులో లేడు. అసిస్టెంటు కమీషనర్‌కి చెప్పాను. ఆయన టెలిఫోన్ హౌస్‌కి వెంటనే ఫోన్ చేస్తానన్నాడు."

"భార్గవ ప్రసాద్ ఇంటి చిరునామా తెలుసుకున్నావా?"

చాలా సులభంగా తెలిసింది. టెలిఫోన్ డైరెక్టరీలో వుంది. అడయార్‌లో శ్రీనివాసయ్యర్ రోడ్.

"గుడ్" అన్నాడు యుగంధర్.

ఇంటికి ఫోన్ చేసి భార్గవప్రసాద్ తన భార్యతో మాట్లాడకుండా అతని ఇంటి టెలిఫోన్ డిస్‌కనెక్టు చేసి ఉంచమని టెలిఫోన్ అధికారులకి చెప్పమని పోలీస్ అసిస్టెంటు కమీషనర్‌కి రాజు చేత ఫోన్ చేయించాడు యుగంధర్. భార్గవప్రసాద్ గదిలో రాజు చేతి మీద యుగంధర్ రాసిన గుర్తుల సారాంశం అదే.

"ఎందుకంత వేగంగా తోలుతున్నావు?" అడిగాడు బండార్కర్ రాజుని.

"టెలిఫోన్ పని చేయడం లేదని భార్గవప్రసాద్ యింటికి వెళితే అతను ఇంటికి వెళ్ళేలోగా మనం అక్కడికి చేరుకోవాలి" అన్నాడు యుగంధర్.

"భార్గవప్రసాద్ అబద్ధం చెపుతున్నాడని మీకు నిశ్చయమైందా?" అడిగాడు బండార్కర్.

యుగంధర్ నవ్వి "నిశ్చయం కాలేదు అనుమానం ఎక్కువైంది" అన్నాడు.

తరువాత పదినిమిషాలు ఎవరూ మాట్లాడలేదు. అడయార్లో శ్రీనివాసయ్యర్ రోడ్లో ఉన్న భార్గవప్రసాద్ ఇల్లు సులభంగానే కనుక్కున్నాడు రాజు.

గేటుకి దూరంగా వుంది ఇల్లు. రాజు పోర్టికోలో కారు ఆపాడు.

4

"కూర్చోండి. అమ్మగారికి చెపుతాను" అని నౌకరు వెళ్ళిపోయాడు.

"ఇంత పెద్ద ఇల్లు ఇద్దరు ఏం చేసుకుంటారో?" అన్నాడు రాజు.

అయిదు నిమిషాల తరువాత ఎదురుగా వున్న తెర కదిలిన అలికిడి అయింది. గజ్జెలు గలగల మోగాయి. ముగ్గురూ అటు చూశారు.

"గజ్జెలు నేను కట్టుకోలేదు. తెరకి కట్టాను" నవ్వుతూ వచ్చి వాళ్ళకి ఎదురుగా కూర్చున్నది "నేనే మిసెస్ భార్గవ. నా పేరు లక్ష్మి" అన్నది.

ముప్పయి, ముప్పయి అయిదేళ్ళ వయస్సు వుంటుంది. గులాబీరంగు వొళ్ళు. ఇన్నేళ్ళూ ఒంటిని జాగ్రత్తగా కాపాడుకుంది. గులాబీరంగు వాయిల్ చీర, అదే రంగు జాకెట్టు. జడ అల్లుకుని చుట్ట చుట్టుకున్నది. చురుకయిన మొహం, మెరిసే కళ్ళు, ఎర్రని నిండు పెదిమలు, అందమైన పళ్ళవరస.

"నా కోసం వచ్చారని నౌకరు చెప్పాడు. నా కోసమా భార్గవగారి కోసమా?" అడిఒగిందామె.

"మీతో మాట్లాడడానికే వచ్చాము" చెప్పాడు యుగంధర్.

"మాట్లాడండి."

"నిన్న సాయంకాలం మీ భర్త యింటికి ఎన్ని గంటలకి వచ్చారు? అడిగాడు యుగంధర్.

ఆమె మొహం చిట్లించి "అదేం ప్రశ్న? ఆయన్నే అడిగి వుండొచ్చుగా" అన్నది.

"జవాబు చెప్పడానికి మీకేమయినా అభ్యంతరమా?" అడిగాడు యుగంధర్.

ఆమె యుగంధర్‌ని పరీక్షగా చూసి "నేను జవాబు చెప్పనంటే" అడిగింది.

"నౌకర్లని పిలిచి అడుగుతాము."

ఆమె నవ్వి "అయితే నేనే చెపుతాను. నిన్న సాయంకాలం ఏడుగంటలకి నా భర్త యింటికి వచ్చారు" అన్నది.

"మళ్ళీ బయటికి వెళ్ళారా?"

"ఆ"

"ఎప్పుడు?"

"ఏడున్నరకి."

"తిరిగి యింటికి ఎప్పుడు వచ్చారు?"

"టైం సరిగ్గా తెలియదు. రాత్రి పన్నెండు గంటలవరకూ యింటికి రాలేదు. అతవరకు నేను మెలుకువగానే వున్నాను. తరువాత నేను నిద్రపోయాను. ఎప్పుడో వచ్చి వుండాలి. పొద్దున్న నాకన్నా ముందు లేచారు. నేను నిద్రలేచి హాల్లోకి వచ్చేటప్పటికి, డ్రెస్ చేసుకుని బయలుదేరుతున్నారు."

"తరచూ రాత్రిళ్ళు ఆలస్యంగా యింటికి వస్తూ వుంటారా?"

"పత్రికా సంపాదకులుకదా! ఒక టైం అంటూ లేదు. ఈ మధ్య రాత్రిళ్ళు ఆలస్యంగా రావడం ఎక్కువయింది.

"ఈ మధ్య ఆలస్యంగా రావడం ఎక్కువ అవడానికి ఏమయినా కారణం వుందా?"

"రాజకీయాలు అనుకుంటాను. ఎన్నికలు దగ్గర పడ్డాయిగా."

"థాంక్ యు వెరీ మచ్. మేము వస్తాము" అని యుగంధర్ లేచాడు.

"నన్ను యిన్ని ప్రశ్నలు అడగడానికి కారణం ఏమిటో చెబుతారా" అడిగింది.

"నిన్న రాత్రి ఫిరోజ్ అనే అతను మరణించాడు. అతను చైనా దేశస్థుడు. ఈ వూరికి వచ్చిన తర్వాత మీ వారిని కలుసుకునేందుకు ప్రయత్నించాడు. కలుసుకోలేదట. అది ఒక కారణం" చెప్పాడు యుగంధర్.

"మీ ప్రశ్నలకి నేను నిజమైన జవాబులు చెప్పడం వలన నా భర్తని యిబ్బందిలో పెట్టానా?"

"నిజం చెప్పడం వలన ఎవరూ యిబ్బందులు పాలు కారు" అన్నాడు యుగంధర్.

5

సాయంకాలం అయిదున్నర అయింది. నేషనల్ డెయిలీ న్యూస్ ఆఫీసులోంచి యిద్దరో, ముగ్గురో చొప్పున బయటికి వస్తున్నారు షిఫ్టు ప్రెస్ వర్కర్సు రాత్రి డ్యూటీలో వుండే సంపాదకీయ వర్గం ఉద్యోగులు. వీళ్ళకి తప్ప మిగతావాళ్ళందరికీ ఆ రోజుకి ఆఫీసు పని పూర్తయింది.

ఆ దినపత్రిక ఆఫీసుకి ఎదురుగా వున్న పెట్రోలు బంక్‌లో రాజు తన స్కూటర్ ఆపి ఉంచి, పేవ్‌మెంట్ మీద నిలబడి సిగరెట్ కాలుస్తున్నాడు. కళ్ళకి అద్దాలు పెట్టుకుని, జుట్టు పైకి దువ్వుకుని, రూపం మార్చుకున్నాడు. ఆ కాస్త మార్పూ చాలునని రాజు ధైర్యం.

ఆరుగంటల ప్రాంతాల్లో భార్గవప్రసాద్ సెక్రటరీ నళిని వీధిలోకి వచ్చింది. ప్రొప్రయిటరు సెక్రటరీ కదా బస్ ఎక్కి వెళుతుందా? ఆఫీసు కారు యివ్వరా? అనుకుంటూ రాజు ఆమెనే చూస్తున్నాడు.

ఖాళీ టాక్సీని పిలిచి ఎక్కింది నళిని. వెంటనే రాజు తన స్కూటరు మీద బయలుదేరాడు. నుంగంబాకంలో కొత్తగా కట్టిన ఒక చిన్న యింటి ముందు నళిని టాక్సీ దిగింది. రాజు ఆగకుండా వీధి చివరి వరకూ వెళ్ళాడు. మలుపు తిరగగానే చిన్న మోటరు వర్కు షాపు కనిపించింది. స్కూటరు ఆ వర్కు షాపులోకి తీసుకెళ్ళి, "క్లచ్ చాలా బిగుతుగా వుంది. చూస్తారా! కాసేపట్లో వస్తాను. ఆలోగా సరిచేసి పెట్టండి" అని చెప్పి కాలినడకన వెనక్కి వెళ్ళాడు.

నళిని ఇంటిముందు ఖాళీ స్థలం వుంది. ఆ చుట్టు ప్రక్కల ఓ కిల్లీ కొట్టుకూడా లేదు. ఆమె ఇంటివైపు చూశాడు రాజు. వీధి తలుపు మూసి వుంది. కిటికీల దగ్గర కూడా ఎవరూ లేరు. ఆ ఖాళీ స్థలంలోకి వెళ్ళాడు. ఓ మూల యిసక పోసి వుంది. ఆ ఇసక దిబ్బ వెనక కూర్చున్నాడు. కాసేపటికి బాగా చీకటిపడ్డది.

నళిని యింట్లో దీపాలు వెలిగాయి. ఆమె కాక ఇంకో స్త్రీ వుంది ఇంట్లో. ఆమె కిటికీ దగ్గరికి వచ్చినపుడు రాజు చూశాడు. రెండు మూడుసార్లు నళిని కిటికీ దగ్గరికి వచ్చి తొంగి చూసింది. ఎవరో వస్తారని చూస్తోందని రాజు

గ్రహించాడు. ఓపికగా కాచుకున్నాడు. ఓ గంట దాటిపోయింది. అయిదు నిమిషాలకీ, పది నిమిషాలకీ నళిని కిటికీ దగ్గరికి వచ్చి చూస్తోంది.

వేగంగా వచ్చి చటుక్కున ఓ కారు ఆగింది ఆమె యింటిముందు. నల్లరంగుకారు. వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ కనిపించే ఎంబాసిడర్. అందులోంచి ఇద్దరు దిగారు. చీకటిగా వుండడం వల్ల అస్పష్టంగా వాళ్ళ ఆకారాలు మాత్రం కనిపించాయి రాజుకి. తలుపు తట్టడం తలుపు తెరుచుకోవడం వినిపించాయి. వాళ్ళు లోపలికి వెళ్ళగానే తలుపు మూసుకుంది. నళిని వీళ్ళ కోసమే చూసిందా? కిటికీ రెక్కలు కూడా ఎందుకు మూసేశారు. ఇద్దరు ప్రియులా? లేక ఒకతను ప్రియుడు, రెండోవాడు ప్రియుడి స్నేహితుడా? ఇంట్లో యింకో స్త్రీ వుంది కదా! ఇద్దరికీ యిద్దరు ప్రియులా? ప్రియులే అయితే యింత గోప్యం ఎందుకు? చీకటి పడ్డాక రావడం, తలుపు బార్లా తెరవకపోవడం, చటుక్కున లోపలికి వెళ్ళడం, వెంటనే మూసెయ్యడం ఎందుకు? నళినికి భర్త లేడుగా. ఏమో వాళ్ళెవరో ఎందుకు వచ్చారో తెలుసుకోవాలి తను. రెండు కళ్ళు అప్పగించి అటు చూస్తున్నాడు రాజు.

అరగంట దాటింది. ఓపికతో కాచుకున్నాడు అతడు. తలుపు ఎప్పుడు తెరుచుకుంటుంది? వాళ్ళు ఎప్పుడు బయటికి వస్తారు? తెల్లారే వరకూ రారా? ఆ అంబాసిడర్ నెంబరు డైరీలో రాసుకున్నాడు.

పావుగంట తరువాత కారు ఇంజన్ స్టార్టు అయేసరికి రాజుకి ఆశ్చర్యం కలిగింది. వాళ్ళు బయటికి రావడం తనకి కనిపించలేదు. తలుపు తెరిచి వుంటే దీపం వెలుగు కనిపించేది.

కారు బయలుదేరి వేగంగా వెళ్ళిపోయింది. తను పరిగెత్తుకు వెళ్ళి స్కూటర్ తీసుకున్నా వాళ్ళని వెంబడించలేదు. డ్రైవర్ మాత్రమే వెళ్ళిపోయాడేమో టీ తాగడానికి. వాళ్ళు లోపలే వున్నారేమో?

ఇంకో అరగంట గడిచింది. వెళ్ళిపోయిన కారు తిరిగి రాలేదు. ఇక తను అక్కడ కూర్చుని ప్రయోజనం లేదు. ఇసక దిబ్బ వెనకనించి లేచి నెమ్మదిగా ఇంటివేపు వెళ్ళాడు రాజు.

గేటు తెరిచే వుంది. వీధి గుమ్మం దగ్గర నిలబడి చెవులు రిక్కించుకుని విన్నాడు లోపలనించి మాటలు చప్పుళ్ళు వినిపిస్తాయేమోనని, నిశ్శబ్దం.

అతను తలుపు తట్టాడు నెమ్మదిగా, నిమిషం తరవాత గట్టిగా తట్టాడు. ఇంకో నిమిషం తరువాత తలుపు బాదాడు. ఎవరూ పలకలేదు. తలుపు తియ్యలేదు. తలుపు బలంగా తోశాడు. తెరుచుకోలేదు. గుమ్మం మెట్లు దిగి చుట్టూ తిరిగి యింటి వెనక్కి వెళ్ళాడు. వెనక తలుపు మూసి వుంది. తోశాడు. తెరుచుకుంది. రెండో రెక్క తోశాడు. అదీ తెరుచుకుంది.

అక్కడే నిలబడి రెండు నిమిషాల సేపు లోపలికి చూశాడు. చిన్న నడవాలా వుంది. చీకట్లో స్పష్టంగా కనిపించడంలేదు. జేబులోంచి పిస్తోలు తీసి తీసి పట్టుకుని లోపలికి అడుగు పెట్టాడు. గోడని తడిమి చూశాడు. ఎలక్ట్రిక్ స్విచ్ చేతికి తగిలింది. స్విచ్ వేశాడు. క్లిక్ మన్న శబ్దం అయింది కాని దీపం వెలగలేదు.

రాజు యింకో జేబులోంచి టార్చి లైటు తీసి వెలిగించి అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకి నడిచాడు. ఎడం వేపున ఓ గది తలుపు మూసి వుంది. తోశాడు. తెరుచుకుంది. ఆ గదిలో వున్న స్విచ్ మీద చెయ్యి పెట్టాడు. స్విచ్ వేసే వుంది. కాని దీపం వెలగటంలేదు. అది స్నానాల గది, ఎవరూ లేరు. ఇంకొంచెం ముందుకి వెళ్ళాడు. కుడివేపున తలుపు తెరిచేవుంది. వెలుగు గదిలోకి వేశాడు. నేలమీద పళ్ళెంలో తరిగిన ఉర్లగడ్డ  ముక్కలు, చిన్నపీట కత్తి, రెండు గిన్నెలు. అది వంట గది. లోపలికి వెళ్ళాడు. చిన్న అరుగు మీద స్టవ్. దానిమీద గిన్నె. గిన్నెలో సగం వుడికిన బియ్యం. స్టవ్ ఆరిపోయి వుంది. వంట చేస్తున్న మనిషి అక్కణ్ణించి వెళ్ళి మళ్ళీ రాలేదు ఎందుకు?

రాజు పిస్తోలు యింకొంచెం గట్టిగా పట్టుకున్నాడు. వంటగదిలోంచి అవతల గదిలోకి వెళ్ళాడు. అది భోజనాల గది. బల్లచుట్టూ కుర్చీలు, బల్లమీద మంచినీళ్ళ చెంబు, గ్లాసులు బోర్లించి వున్నాయి. ఎవరూ లేరు. అవతల గదిలోకి వెళ్ళాడు. అది హాలు. ఒక సోఫాసెట్టు. నేలమీద తివాసీ, రెండు కుర్చీలు. మధ్య చిన్న బల్ల. ఆ బల్లమీదికి కాళ్ళు జాపుకుని సోఫాలో పడుకునున్నది నళిని.

రెండు కాళ్ళూ కట్టేసి వున్నాయి బల్లకి. చేతులు వెనక్కి విరిచి కట్టబడి వున్నాయి. నోరు మెదపకుండా నోటినిండా జేబురుమాళ్ళు. మనిషి కదలకుండా ఛాతీమీదనించి అడ్డంగా తాడు.

రాజు చేతిలో టార్చి వెలుగు ఆమె మొహం మీద పడేసరికి కళ్ళు అరక్షణం మూసి, చిట్లించి భయంతో చూసింది .రాజు త్వరగా పరిగెత్తికెళ్ళి వెనక తలుపు మూసి, లోపల గడీయ్యెట్టి వచ్చి, టార్చి సోఫాలో ఆమె పక్కన పెట్టి ఆమె నోటిలో కుక్కబడిన రుమాళ్ళు లాగేసాడు. "భయపడకండి. నేను రాజుని. యుగంధర్ అసిస్టెంటుని, ఎలక్ట్రిక్ మెయిన్ స్విచ్ ఎక్కడున్నది" అడిగాడు.

"ముందు గదిలో."

రాజు వెళ్ళి మెయిన్ స్విచ్ వేశాడు. ఇంట్లో దీపాలు వెలిగాయి. హాల్లోకి మళ్ళీ వచ్చి ఆమె కాళ్ళకీ, చేతులకి, ఛాతీమీదా కట్టిన కట్లు విప్పాడు. "ఇంకో స్త్రీ వుండాలి ఆమె ఏదీ?" అదిగాడు.

"మెట్ల క్రింద" చెప్పింది.

హాల్లోంచి మేడమీదకి మెట్లున్నాయి .మెట్లకింద చిన్న గుడు వుంది. ఆ ఇంకో స్త్రీని ఆ గూడులోంచి బయటికి లాగాడు రాజు. ఆమెని కూడా కదలకుండా కట్టేశారు. అరవకుండా నోట్లో గుడ్డలు కుక్కారు నోట్లో గుడ్డలు లాగేసి, కట్లు వూడతీసి, చెయ్యి పట్టుకుని నడిపించుకుంటూ తీసుకువచ్చి సోఫాలో కూర్చిపెట్టాడు. "ఏం జరిగిందో చెప్పండి" అడిగాడు.

నళిని అతన్ని పరీక్షగా చూసి "ముందు తాగడానికి ఏమైనా కావాలి తరువాత చెపుతాను" అంది.

"నిమిషంలో  కాఫీ తెస్తాను" అని ఆ రెండో ఆమె వంట ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"మమ్మల్ని రక్షించడానికి సరిగ్గా సమయానికి మీరు ఇక్కడికి ఎలా వచ్చారు?" అడిగింది నళిని.

"కాఫీ రానివ్వండి. తరవాత చెపుతాను" అన్నాడు రాజు నవ్వుతూ. ఆమెనే పరీక్షగా చూస్తున్నాడు. చెంపలు తెల్లగా వున్నాయి. బెదురు చూపులు చూస్తోంది. పెదిమలు వొణుకుతున్నాయి అప్పుడప్పుడు. చాలా భయపడి వుండాలి అనుకున్నాడతను.

అయిదు నిమిషాల తరువాత మూడు కప్పుల్లో కాఫీ తీసుకొచ్చింది లోపలికి వెళ్ళిన ఆమె.

"ఈమె పేరు పార్వతి నా క్లాస్‌మేట్. ఉద్యోగం కోసం ఈ వూరు వచ్చింది. ఇంకా దొరకలేదు .నాతో ఇక్కడే వుంటుంది. ఈయన పేరు రాజు. డిటెక్టివ్ యుగంధర్ అసిస్టెంటు" అని పరిచయం చేసింది ఇద్దర్నీ.

పార్వతి కూడా నళిని వయస్సే. నళిని అంత అందమైనది కాకపోయినా అందంగానే వుంటుంది.

ముగ్గురూ  కాఫీ తాగారు.

(కొనసాగింపు వచ్చేనెలలో)

Post your comments